సాక్షి మహబూబాబాద్

శుక్రవారం | 12 | మే | 2023



కార్మికుల సంక్షేమమే కేసీఆర్ లక్ష్యం

కార్మికుల సంక్షేమమే సీఎం కేసీఆర్ సర్కార్ లక్ష్యమని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు.

- IIలో▸



దొంగ సూపర్‌వైజర్!

కంటి వెలుగు సూపర్‌వైజర్ దొంగగా మారాడు. ఓ మెకానిక్ ఇంటిఎదుట ఉన్న మోటార్‌ను దొంగిలించి పారిపోయే క్రమంలో పట్టుబడి జైలుపాలయ్యాడు.

- IIలో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం

40.8^0 / 27.2^0

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు వడగాలులు వీస్తాయి. పలుచోట్ల సాయంత్రం చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



నెహ్రూసెంటర్: నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి అన్నారు. ఇంటింటికి సీపీఐ కార్యక్రమంలో భాగంగా గురువారం మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో నాయకులు తిరుగుతూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విజయసారథి మాట్లాడుతూ.. నిలువనీడ లేక పేదలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు. వేలాది ఎకరాల ప్రభుత్వ భూమి రియల్టర్ల చేతిలో ఉందని ఆరోపించారు. బీజేపీ పతనం ప్రారంభమైందని, ప్రజలు రానున్న ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, నర్ర శ్రావణ్, వెలుగు శ్రావణ్, చిదిరాల జ్ఞానేశ్వర్, నాగెల్లి యాకమ్మ, పురం భాగ్య, మంద శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన 54మంది జేపీఎస్‌లు

మహబూబాబాద్: జిల్లాలో ప్రభుత్వం ఇచ్చిన గడువు మేరకు ఈ నెల 10వ తేదీ సాయంత్రం వరకు 54మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధుల్లో చేరినట్లు డీపీఓ ధన్‌సింగ్ గురువారం తెలిపారు. జిల్లాలోని 370మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులతో పాటు 11మంది అవుట్ సోర్సింగ్‌లో పని చేసే వారు నిరవధిక సమ్మె చేపడుతున్న విషయం తెలిసిందే. కాగా ప్రభుత్వ ఆదేశాలతో తదుపరి చర్యలు తీసుకుంటామని డీపీఓ తెలిపారు.

జ్వర పీడితులు



కురవి: సీరోలు మండలం కొత్తూరు(సీ) గ్రామంలో చాలా మంది ప్రజలు జ్వరాల బారిన పడి మహబూబాబాద్, ఖమ్మం ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. గురువారం గ్రామానికి చెందిన కొందరు మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్నారు. డెంగీ, ప్లేట్‌లెట్స్ ఇతర వ్యాధులతో బాధపడుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లలేని వారు స్థానిక ఆర్‌ఎంపీల వద్ద వైద్యం చేయించుకుంటున్నారు. కాగా వైద్య సిబ్బంది స్పందించి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీనివాసరావు



తొర్రూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆర్. శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ గజ్జెల రమేష్ నుంచి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. శ్రీనివాసరావు ఇప్పటివరకు హైదరాబాద్‌లోని ఇంటర్ బోర్డు డిప్యూటీ సెక్రటరీగా వ్యవహరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా తొర్రూరు కళాశాలకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన నూతన ప్రిన్సిపాల్‌ను అధ్యాపకులు కలిసి అభినందనలు తెలిపారు.

కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రాజిరెడ్డి బాధ్యతల స్వీకరణ



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ కామర్స్‌అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ కె.రాజిరెడ్డి నియమిస్తూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటివరకు ప్రిన్సిపాల్‌గా పి.వరలక్ష్మి బాధ్యతలు నిర్వర్తించారు. ఆమె పదవీకాలం ముగియడంతో ఆమె స్థానంలో రాజిరెడ్డిని నియమించారు. రాజిరెడ్డి గురువారం వరలక్ష్మినుంచి బాధ్యతలను స్వీకరించారు. రాజిరెడ్డిని ప్రొఫెసర్లు పి.వరలక్ష్మి, నర్సింహాచారి, డాక్టర్ ఓ రవీందర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ ఇతర బోధనేతర సిబ్బంది అభినందించారు.



- 'నర్సింహులపేట మండలం ఎర్రలచ్చయ్య గూడానికి చెందిన రైతు లింగాల గోవర్ధన్ తనకున్న ఐదు ఎకరాల్లో వరి కోసి కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చాడు. కేంద్రంలో ధాన్యం పోసి పది రోజులు దాటింది. ఈ మధ్యలో తడవగా తిరిగి ఆరబోశాడు. తేమ శాతం 14కు వచ్చింది. కానీ తేమ శాతం కొలిచే వారు లేరు.. ధాన్యం కొనేవారు లేరని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. మళ్లీ పెద్ద వర్షం వస్తే ధాన్యం తడుస్తుందని, అధికారులు కొనుగోళ్లు ప్రారంభించాలని రైతు గోవర్ధన్ కోరుతున్నాడు.'



- 'కురవి గ్రామానికి చెందిన బానోత్ తుకారం తన ఏడెకరాల్లో పండిన 180 క్వింటాళ్ల ధాన్యం తెచ్చి కొనుగోలు కేంద్రంలో పోశాడు. ముందు ధాన్యం తెస్తే ముందే కొంటరని కేంద్రం ప్రారంభానికి రెండు రోజులు ముందే ధాన్యం తెచ్చాడు. కానీ కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చి 17రోజులు దాటినా..కొనడం లేదు. తేమశాతం 17లోపు ఉన్నా ధాన్యం కొనడం లేదని, దీంతో ఉదయం అంతా ఆరబోయడం, రాత్రి దగ్గరకు నెట్టడంతోనే సరిపోతుందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.'



- 'ఇనుగుర్తి గ్రామానికి చెందిన నార్ల మురళి తన పొలంలో పండిన 100 బస్తాల ధాన్యం ఇనుగుర్తి కొనుగోలు కేంద్రంలో పోశాడు. పదిరోజులుగా పలుమార్లు ధాన్యం తడిసి ఎండింది. మూడు రోజులుగా ధాన్యం ఎండి తేమ శాతం తక్కువగా ఉంది. అయినా అధికారులు రావడం లేదు. ధాన్యం కొనడం లేదు. ఇదేమిటి అని అడిగితే అధికారులు చెప్పాలి.. అప్పుడే కొంటామని నిర్వాహకులు సమాధానమిస్తున్నారని రైతు వాపోతున్నాడు. ధాన్యం త్వరగా కొనాలని కోరుతున్నాడు.'



- 'చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన చిత్తారి లచ్చయ్య రెండు ఎకరాల పొలంలో పండిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో పోశాడు. మధ్యలో ధాన్యం తడవగా ఆరబెట్టాడు. ప్రస్తుతం తేమ శాతం తగ్గింది. కానీ ఆ సెంటర్‌లో ఇప్పటి వరకు కొనుగోళ్లు ప్రారంభించలేదు. దీంతో ఆకాశం వైపు చూస్తే భయం వేస్తుందని, వర్షం వస్తే మళ్లీ ధాన్యం తడుస్తుందని రైతు ఆందోళన చెందుతున్నాడు. తొందరగా కొనుగోలు చేస్తే తమ కష్టాలు పోతాయని వేడుకుంటున్నాడు.'

ఇంకెప్పుడు కొంటరు!

కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల నిరీక్షణ

- ధాన్యంతో వారాల తరబడి కేంద్రాల వద్దే
- తేమశాతం తగ్గినా.. కొనుగోళ్లలో జాప్యం
- ఉదయం ఆరబోయడం, సాయంత్రం దగ్గరకు చేర్చడం



చిన్నగూడూరు ధాన్యం కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన వడ్ల రాశులు

సాక్షి, మహబూబాబాద్: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో వారాల తరబడి రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద నిరీక్షిస్తున్నారు. అధికారులు ఎప్పుడు వస్తారో.. తేమ శాతం చూసి ఎప్పుడు కాంటాలు పెడతారో అని పడిగాపులు కాస్తున్నారు. కాగా మళ్లీ వర్షం వస్తే ధాన్యం తడుస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మందకొడిగా కొనుగోళ్లు..

సాయంత్రం అయితే ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు పొద్దంతా ధాన్యం రాశుల వద్దే ఉంటున్నారు. ధాన్యం ఆరబోయడం, సాయంత్రం దగ్గరకు నెట్టడమే రైతుల దినచర్యగా మారింది. ఓ వైపు వర్షం భయం రైతులను వెంటాడుతుంటే.. కేంద్రాల నిర్వాహకులు మాత్రం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 189 సెంటర్ల ద్వారా 1.80లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రణాళిక సిద్ధం చేశారు. దీనిలో భాగంగా గత 18రోజుల క్రితమే కేంద్రాలు అధికారికంగా ప్రారంభించారు. కాగా జిల్లాలో మొత్తం కొనుగోలు ప్రారంభించామని జిల్లా అధికారులు చెబుతున్నారు. కానీ 122కేంద్రాలే ప్రారంభించి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు శాఖలోని అధికారులు, సిబ్బంది అంటున్నారు. ఇందులో కూడా సగం కేంద్రాల్లో మొక్కుబడిగానే కొనుగోలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. అందుకోసమే కేంద్రాలు ప్రారంభించి 18 రోజులు దాటినా ఇప్పటి వరకు కేవలం 1,9348 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు రికార్డులు చెబుతున్నాయి. అంటే ఒక్కో కేంద్రంలో సుమారు 150మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొన్నట్లు అర్థమవుతోంది.

తేమశాతం కొలిచేవారు కరువు..

కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం ఎండిపోయి పరంపరం అవుతోంది. అధికారులు చెప్పిన విధంగా 17శాతం లోపు తేమ ఉంటే ధాన్యం కొనుగోలు చేయాలి. కానీ ధాన్యంలో తేమ కొలిచేందుకు కేంద్రాల వద్ద అధికారులు, సిబ్బంది కరువయ్యారు. వ్యవసాయ శాఖ, లేదా మార్కెటింగ్, ఇతర శాఖల అధికారులు వచ్చి తేమశాతం కొలవాలి. అయితే వారికి నచ్చిన చోటుకు నచ్చినప్పుడు వస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ధాన్యం ఎండినా.. సరైన సమయంలో అధికారులు రాకపోవడం, కాంటాలు పెట్టకపోవడంతో రైతులు కేంద్రాల వద్దే ఉండాల్సి వస్తోంది. ఈ మధ్యలో వర్షం వచ్చిందంటే అంతే సంగతులు. మళ్లీ నాలుగైదు రోజులు ఆరబెట్టాలి. కాగా ఉదయం అంతా ధాన్యం ఆరబోస్తూ.. సాయంత్రం కాగానే వర్షం భయంతో దగ్గరకు పోసి టార్పాలిన్లు కప్పాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీలకు ఎంపిక

తొర్రూరు: థాయ్‌లాండ్‌లో జరిగే అంతర్జాతీయ కరాటే పోటీలకు తొర్రూరుకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. పట్టణంలోని ఓ కరాటే అకాడమీలో శిక్షణ పొందిన గాదగాని శివతేజ, దర్శ్ గోయల్, మంగళపల్లి హరిప్రియ తాజాగా ముంబై, బెంగళూరు, గోవా ప్రాంతాల్లో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో సత్తా చాటారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చిన ముగ్గురు విద్యార్థులు ఈ నెల చివరి వారంలో థాయ్‌లాండ్‌లో జరిగే కరాటే పోటీల్లో పాల్గొననున్నారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను గురువారం డివిజన్ కేంద్రంలోని యతిరాజారావు పార్కులో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. కరాటే మాస్టర్ సోమ శ్రీధర్‌ను అభినందించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వింజమూరి సుధాకర్, కార్యదర్శి రాయిశెట్టి వెంకన్న, ప్రతినిధులు నాగిరెడ్డి, వల్లపు మహేష్, యాకూబ్‌రెడ్డి, సోమనర్సయ్య, రామకృష్ణ, బాలాజీ పాల్గొన్నారు.

నిట్‌లో నేషనల్ టెక్నాలజీ డే వేడుకలు

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో నేషనల్ టెక్నాలజీ డే వేడుకలను వర్చువల్‌గా గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కేంద్ర రక్షణ మంత్రి సైంటిఫిక్ అడ్వైజర్ డాక్టర్ సతీష్‌రెడ్డి వర్చువల్‌గా పాల్గొని మాట్లాడారు. స్కూల్ టు స్టార్టప్ ఇగ్నైటింగ్ యంగ్ మైండ్స్ టూ ఇన్నోవేట్ అనే థీంతో నేషనల్ టెక్నాలజీ–23 డేను నిర్వహిస్తున్నామని అన్నారు. దేశవ్యాప్తంగా 65– ఇంక్యుబేషన్ సెంటర్ల అనుసంధానంతో 2016లో భారతదేశంలో 461 స్టార్టప్‌లు ఉండగా, నేడు లక్ష స్టార్టప్‌లు ఉన్నాయని, యువత కొత్తవాటికి నాంది పలకాలని ఆకాంక్షించారు. యుద్ధవిమానాల తయారీలో రాణిస్తున్న ఆరు దేశాలతో భారతదేశం పోటీ పడి తేజస్ విమానాల తయారీకి శ్రీకారం చుట్టిందని అన్నారు. నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ మాట్లాడు డారు. కార్యక్రమంలో నిట్ రిజిస్ట్రార్ గోవర్ధన్‌రావు, డీన్ ఎన్వీ.ఉమామహేష్, ప్రొఫెసర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మస్తు వాడకం..

విద్యుత్‌కు భారీగా డిమాండ్

- గత నెల నుంచి పెరిగిన ఉష్ణోగ్రతలు
- ఈ నెలలో మరింత పెరగనున్న విద్యుత్ వాడకం
- జిల్లాలో 1,65,510 గృహ విద్యుత్ సర్వీసులు



జిల్లాలో వినియోగించిన విద్యుత్

నెల	యూనిట్ల వినియోగం
ఫిబ్రవరి	7.88 మిలియన్ యూనిట్లు
మార్చి	6.84 మిలియన్ యూనిట్లు
ఏప్రిల్	7.64 మిలియన్ యూనిట్లు

నెహ్రూసెంటర్: ఎండలు దంచికొడుతున్నాయి. ప్రజలు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు ఇళ్లల్లో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు ఎక్కువగా వాడుతున్నారు. దీంతో జిల్లాలో విద్యుత్ వినియోగం క్రమంగా పెరుగుతోంది. జిల్లాలో గృహ విద్యుత్ సర్వీసులు 1,65,510 ఉన్నాయి. వీటి ద్వారా మార్చి నెలలో 6.84మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం కాగా.. ఏప్రిల్‌లో 7.64 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగించారు. కాగా ఈ నెలలో విద్యుత్ వాడకం పెరిగే అవకాశం ఉందని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు.

ఉష్ణోగ్రతల పెరుగుదల..

వేసవికాలం ప్రారంభం నుంచి జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఒక దశలో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు ఉక్కపోత, ఎండ వేడిమితో ఉక్కిరిబిక్కిరయ్యారు. దీంతో విద్యుత్ వినియోగం కూడా పెరిగింది. ఎండ నుంచి ఉపశమనం కోసం ఇంట్లో కూలర్లు, ఫ్యాన్లను రాత్రి, పగలూ తేడా లేకుండా అధికంగా వినియోగిస్తున్నారు.

విద్యుత్ ఆదా చేయండి..

ప్రస్తుత వేసవికాలంలో ఎండల నుంచి ఉపశమనం కోసం ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు అధికంగా వినియోగిస్తుంటాం. దీంతో అధికంగా విద్యుత్ వినియోగం కాగా నగదు అధికంగా చెల్లించాల్సి వస్తుంది. ఇలాంటి సమయాల్లో విద్యుత్ ఆదా చేసేందుకు ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలని విద్యుత్ అధికారులు కోరుతున్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లే సమయంలో ఇంట్లోని ఫ్యాన్, లైట్లు, ఇతర విద్యుత్ వినియోగ వస్తువులను ఆఫ్ చేస్తే బెటర్. అంతేకాకుండా ఇంట్లో వాడే విద్యుత్ పరికరాలు ఉత్తమమైనవి, ఫైవ్‌స్టార్ రేటింగ్స్‌ను కలిగిన వాటినే వినియోగించాలి. సాధారణ బల్బుల స్థానంలో ఎల్ఈడీ బల్బులను వినియోగించడం వల్ల విద్యుత్‌ను ఆదా చేయవచ్చు. ఒక్క విద్యుత్ యూనిట్ ఆదా చేసిన రెండు యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసినట్లేనని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. పగటిపూట లైట్లను వినియోగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

పొదుపుగా వాడుకోవాలి



వినియోగదారులు విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి. ఎండాకాలం దృష్ట్యా విద్యుత్ వినియోగం పెరుగుతుంది. వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్‌ను అందజేస్తాం. విద్యుత్‌లో ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇవ్వండి వెంటనే పరిష్కరించి విద్యుత్‌ను నిరంతరాయంగా అందజేస్తాం.

– నరేష్, ఎస్ఈ, మహబూబాబాద్

రైతులు ఆందోళన చెందవద్దు

- పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి
- అరవై ఎకరాల్లో ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణం
- సీఎం ప్రకటించిన నిధులను సమర్థవంతంగా వినియోగిస్తాం
- మంత్రి సత్యవతిరాథోడ్



మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్

మహబూబాబాద్: రైతులు ఆందోళన చెందవద్దని, తడిసిన ధాన్యం, మక్కలు కొనుగోలు చేస్తామని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఇంజనీరింగ్ శాఖ, పీఆర్‌శాఖ, ట్రైబల్ వెల్ఫేర్, మున్సిపాలిటీ అభివృద్ధిపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో ధాన్యం కొనుగోలు సజావుగా చేపట్టాలని ఆదేశించారు. సీఎం కేసీఆర్ జిల్లాకు ప్రత్యేకంగా కేటాయించిన నిధులను సమర్థవంతంగా వినియోగించాలన్నారు. ప్రభుత్వ భవనాల కోసం కేటాయించిన భూముల్లో బోర్డులు ఏర్పాటు చేయాలని, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. జిల్లా కేంద్రంలో అరవై ఎకరాల్లో ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణం చేపట్టాలని సూచించారు. రామచంద్రాపురంకాలనీ సమీపంలో ఏడెకరాల్లో గిరిజన గురుకులం, మరో ఏడెకరాల్లో పీజీ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. వృత్తి విద్యా కోర్సుల కోసం కాలేజీ భవనం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రూ.132కోట్లతో 183 పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. జిల్లాలో మిర్చి పంట విస్తరణకు చర్యలు తీసుకోవాలని, రెండు ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్లు కొనసాగుతున్నాయని, మరో సెంటర్ నిర్మాణంలో ఉందన్నారు. 114 జీపీ భవనాల నిర్మాణం జరుగుతుందని, మరో 62 జీపీల భవనాలకు అనుమతులు జారీ చేశామని పేర్కొన్నారు. కలెక్టరేట్ సమీపంలో త్వరలోనే అంబేడ్కర్ భవనం, ధోబీఘాట్, గిరిజన భవన్‌లను నిర్మిస్తామని చెప్పారు.

మానుకోట మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు సిద్ధంగా ఉన్నామన్నారు. సమీక్షలో కలెక్టర్ శశాంక, ఎంపీ కవిత, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తీర్ణత శాతం పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహరావు

మహబూబాబాద్ అర్బన్: బీసీ వెల్ఫేర్ వసతి గృహాల్లో ఉంటూ చదువుతున్న పది, ఇంటర్, డిగ్రీ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి నర్సింహరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో గురువారం బీసీ హాస్టల్స్ వార్డెన్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహరావు మాట్లాడుతూ.. జిల్లాలోని బీసీ హాస్టల్‌లో ఉంటూ పదో తరగతి చదివిన 148మంది విద్యార్థుల్లో 134మంది ఉత్తీర్ణత సాధించారని, 14మంది పరీక్షలకు గైర్హాజరయ్యారన్నారు. కాగా ఒక విద్యార్థి 10జీపీఏ సాధించినట్లు తెలిపారు.ఫెయిల్ అయిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వచ్చే విద్యా సంవత్సరానికి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హాస్టల్స్ వార్డెన్లు అర్జున్,ఎల్లస్వామి, పైడి, కల్పన, సుచరిత, రమాదేవి, ఉమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

- కలెక్టర్ శశాంక



కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. గురువారం మానుకోట మున్సిపల్ పరిధి శనిగపురం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన ధాన్యం విక్రయించేందుకు క్లీనర్ల ద్వారా శుభ్ర చేయించాలన్నారు. తేమశాతాన్ని బట్టి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, తేమ శాతాన్ని బట్టి ధాన్యం, మక్కలను వెంటనే కొనుగోలు చేయాలన్నారు. అధికారులు కేంద్రాలను తనిఖీ చేయాలని, సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలన్నారు. సివిల్ సప్లయీస్ అధికారులు, మార్క్‌ఫెడ్ అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. కలెక్టర్ వెంట డీసీఓ ఖుర్షీద్, సంబంధిత అధికారులు ఉన్నారు.

ఏర్పాట్లు చేయాలి..

వేసవి క్రీడా పోటీలకు తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా యువజన, క్రీడాభివృద్ధి శాఖ అధికారి ఆధ్వర్యంలో సమ్మర్‌క్యాంపుల నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమ్మర్ క్యాంపుల నిర్వహణ కోసం ముమ్మరంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా క్రీడా పోటీలు నిర్వహించాలన్నారు. మండలస్థాయి క్రీడల కోసం సాధ్యమైనంత వరకు తెలంగాణ క్రీడా ప్రాంగణాలను వినియోగించుకోవాలన్నారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 7గంటల వరకు మాత్రమే నిర్వహించాలన్నారు. తాగునీరు, వైద్య శిబిరాల ఏర్పాట్లు చేసి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. 15వ తేదీ నుంచి నిర్వహించే మండలస్థాయి క్రీడలకు ఆన్‌లైన్ ద్వారా కూడా ఎంట్రీలు చేసుకోవచ్చన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా క్రీడల అధికారి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మిల్లులకు తరలించాలి

నెల్లికుదురు: కాంటాలు పెట్టిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. మండలం కేంద్రంలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం, మక్కల కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించి పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ట్రాక్టర్లతో కూడిన ప్యాడీ క్లీనర్లను తప్పక ఏర్పాటు చేయాలన్నారు. రైతులు కోరిన విధంగా టార్పాలిన్లు అందించాలన్నారు. కేంద్రాల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తొర్రూరు ఆర్డీఓ ఎల్.రమేష్, ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి, సర్పంచ్ బీరవెల్లి యాదగిరిరెడ్డి, డీసీఓ ఖుర్షీద్, సివిల్ సప్లయీస్ అధికారి కృష్ణవేణి, తహసీల్దార్ యోగేశ్వరరావు, ఎంపీడీఓ శేషాద్రి, ఏఓ నెలకుర్తి రవీందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మంత్రికి పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలుపుతున్న అధ్యాపకులు

తొర్రూరు: సీఎం కేసీఆర్ కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయడాన్ని హర్షిస్తూ గురువారం డివిజన్ కేంద్రానికి వచ్చిన మంత్రి దయాకర్‌రావును అధ్యాపకులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి అధ్యాపకులకు స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దశాబ్దాలుగా కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న వారిని రెగ్యులరైజ్ చేస్తూ సీఎం కేసీఆర్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారన్నారు. గత ప్రభుత్వాల హయాంలో చాలీచాలని వేతనాలతో కాంట్రాక్టు అధ్యాపకులు ఇబ్బందులు పడ్డారని, బీఆర్ఎస్ సర్కార్ వచ్చాక వారికి వేతనాలు పెంచి అండగా నిలిచిందని గుర్తు చేశారు. 38 జీఓ విడుదలతో కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నిండాయని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో అధ్యాపకులు కందికొండ బాబు, సతీష్, రామ్మూర్తి, వెంకటేశ్వర్లు, మహేందర్, నర్సయ్య, అశోక్, శివ, ఉప్పలయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

విరబూసిన మే పుష్పం



దోర్నకల్: జిల్లాలోని డోర్నకల్ మున్సిపాలిటీ పరిధి యాదవనగర్‌లో ఎస్‌కే.అజిత్‌మియా–సలీమా దంపతుల ఇంట్లో మే పుష్పం విరబూసింది. ఈ పుష్పం సంవత్సరానికి ఒకేసారి విరబూస్తుంది. కాండం నుంచి నేరుగా పువ్వు విరబూయడం విశేషం. లిల్లీ సంతతికి చెందిన కందను కొంతకాలం క్రితం నాటగా ప్రస్తుతం పువ్వు పూసిందని మియా దంపతులు తెలిపారు.

డిగ్రీ కళాశాలలకు వేసవి సెలవులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలలకు అధికారులు వేసవి సెలవులు ప్రకటించారు. ఈ నెల 10నుంచి 31వ తేదీ వరకు సెలవులు వర్తిస్తాయి. జూన్ 1నుంచి పునఃప్రారంభమవుతాయి. డిగ్రీ, 4వ ,6వ సెమిస్టర్ల పరీక్షలు ఈ నెలలోనే జరగనున్నాయి. ఇప్పటికే డ్రాఫ్ట్ పద్ధతిలో పరీక్షల టైంటేబుల్ విడుదల చేశారు.

ప్రతిభను వెలికి తీయడానికే 'కల్చరల్‌ ఫెస్ట్‌'

- ఎస్సార్‌ విద్యాసంస్థల చైర్మన్‌ వరదారెడ్డి
- సుమతిరెడ్డి కళాశాలలో ప్రారంభమైన శ్రీథమ్‌–23 వేడుకలు


నృత్యం చేస్తున్న విద్యార్థిని


మాట్లాడుతున్న వరదారెడ్డి

హసన్‌పర్తి: విద్యార్థినుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ప్రతి ఏటా కళాశాలలో కల్చర్‌ ఫెస్ట్‌ నిర్వహిస్తున్నట్లు ఎస్సార్‌ విద్యాసంస్థల చైర్మన్‌ ఎ.వరదారెడ్డి తెలిపారు. హసన్‌పర్తి మండలం అన్నాసాగరం శివారులోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్‌ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ×కల్చర్‌ ఫెస్ట్‌ శ్రీథమ్‌–23¥ వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి వరదారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. క్రమశిక్షణ, పట్టుదలతో కృషి చేస్తే ఉన్నతస్థాయికి చేరుకుంటారన్నారు. తొలుత శ్రీథమ్‌–23 మ్యాగజీన్‌ను వరదారెడ్డి ఆవిష్కరించారు.

ఆకట్టుకున్న పోటీలు

శ్రీథమ్‌లో భాగంగా విద్యార్థినుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా రంగోలి, మెహందీ, బతుకమ్మ ఆట, కోలాటం, నృత్య ప్రదర్శలు నిర్వహించారు. విద్యార్థినుల సంప్రదాయ వేషధారణ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ రాజశ్రీరెడ్డి, వివిధ విభాగాల అధిపతులు డాక్టర్‌ ఈ.సుదర్శన్‌, డాక్టర్‌ మహేందర్‌, డాక్టర్‌ శ్రీవాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు హేమచంద్ర ప్రోనైట్‌

వేడుకలను పురస్కరించుకుని ప్రముఖ నేపథ్య గాయకుడు హేమచంద్ర ప్రోనైట్‌ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ప్రోగ్రాం కన్వీనర్‌ వేదిక, కో–కన్వీనర్‌ శార్వాణి తెలిపారు.

ఓపెన్‌ టెన్త్‌ జవాబుపత్రాల మూల్యాంకనం

- నేటినుంచి మూడురోజులపాటు
- 14నుంచి ఇంటర్‌ మూల్యాంకనం

విద్యారణ్యపురి: తెలంగాణ ఓపెన్‌ స్కూల్‌ టెన్త్‌ పరీక్షలు ఇటీవలనే ముగిశాయి. ఈనెల 12నుంచి ఓపెన్‌ స్కూల్‌ టెన్త్‌ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం ఉమ్మడివరంగల్‌ జిల్లాకేంద్రం హనుమకొండలోని సెయింట్‌ జోసెఫ్‌ హైస్కూల్‌(తోట బడి)లో నిర్వహించనున్నారు. ఈమేరకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈనెల 12, 13, 14 తేదీల్లో మూడు రోజులపాటు మూల్యాంకనం కొనసాగనుంది. సుమారు 13వేలకు పైగా వివిధ సబ్జెక్టుల టెన్త్‌ జవాబుపత్రాలు వచ్చాయి. స్పాట్‌ వాల్యూయేషన్‌ క్యాంపు ఆఫీసర్‌గా హనుమకొండ డీఈఓ ఎండీ అబ్దుల్‌హై వ్యవహరిస్తున్నారు. సీఈలుగా, ఏసీలుగా ఉపాధ్యాయులను నియమించారు. నేడు ఉదయం 9గంటల నుంచి మూల్యాంకణం ప్రారంభం కానుంది. ఈనెల 14నుంచి ఇంటర్‌ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం 16 వరకు కొనసాగనుంది.

తగ్గిన '10/10జీపీఏ'

- మ్యాథ్స్‌, సైన్స్‌లో తక్కువ మార్కులు రావడమే ప్రధాన కారణం
- అత్యధికులు ఫెయిలైంది కూడా ఈ సబ్జెక్టుల్లోనే..
- ఆరు పేపర్లకు కుదించడంతో తడబాటుకు గురైన విద్యార్థులు

విద్యారణ్యపురి/కాశీబుగ్గ సెంటర్‌/జనగామ/భూపాలపల్లి అర్బన్‌/ములుగు/మహబూబాబాద్‌ అర్బన్‌: ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో బుధవారం వెలువడిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 10/10జీపీఏ సాధకులు తగ్గారు. గత ఏడాదికంటే భారీగా తేడా ఉంది. దీంతో పాటు మ్యాథ్స్‌, సైన్స్‌లో ఎక్కువమంది విద్యార్థులు ఫెయిలయ్యారు. కొందరు విద్యార్థులు మిగతా సబ్జెక్టుల్లో 10 జీపీఏ సాధించినా మ్యాథ్స్‌, సైన్స్‌లో రాకపోవడంతో 10 జీపీఏలు తగ్గిపోయి నట్లు ఉపాధ్యాయులు భావిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 2021–22లో 1,406మంది విద్యార్థులకు 10/10జీపీఏ రాగా, ఈ ఏడాది 573మందికి మాత్రమే వచ్చింది. గతంలో టెన్త్‌ పరీక్షలకు 11 పేపర్లు ఉండేవి. ఈసారి ఆరు పేపర్లకు కుదించారు. అరు పేపర్లని నిర్ణయం తీసుకోవడంలో ప్రభుత్వం, విద్యాశాఖ ఆలస్యం చేసింది. వివిధ జిల్లాల్లో సమ్మెటివ్‌ 1 పరీక్షలు 11పేపర్లుగానే నిర్వహించారు. ఆ తర్వాత ఆరు పేపర్లకు కుదించాక మోడల్‌ పేపర్‌ బ్లూ ప్రింట్‌ విద్యార్థులకు తెలియజేసేసరికి కూడా కొంత ఆలస్యమైంది. ఆ తర్వాత ప్రీ ఫైనల్‌ ఆరు పేపర్ల పరీక్షను నిర్వహించినప్పటికీ విద్యార్థులు అంతగా ఈ మోడల్‌ను అందుకోలేకపోయారని తెలిసింది. గత ఏడాది కరోనా నేపథ్యంలో 70శాతం సిలబస్‌తో పరీక్షలు నిర్వహించారు. ఈసారి 100శాతం సిలబస్‌తో పరీక్షలు నిర్వహించారు. ఈసారి టెన్త్‌ పరీక్షలు రాసిన విద్యార్థులకు 8, 9 తరగతులు కరోనాతో కారణంగా ఆన్‌లైన్‌లో క్లాసులు జరిగాయి. అవి కూడా అంతంత మాత్రమే.. అంతేగాకుండా పరీక్షలు లేకుండానే వారు ప్రమోట్‌ అయి టెన్త్‌ వరకు వచ్చారు. టెన్త్‌లో ఉదయం గంట సాయంత్రం ఒక గంట ప్రత్యేక తరగతులు కూడ నిర్వహించారు. ప్రభుత్వ హైస్కూల్స్‌ల్లోనైతే నెలపాటు సాయంత్రం స్నాక్స్‌ కూడా ఇచ్చారు. కానీ, సాధారణ విద్యార్థులు అందుకోలేక పోయారనేది అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

సైన్స్‌కు తక్కువ సమయం

ఫిజికల్‌ సైన్స్‌, బయోసైన్స్‌ సబ్జెక్స్‌ గతంలో రెండు పేపర్లుగా నిర్వహించేవారు. ఈసారి 20నిమిషాల వ్యవధిలోనే రెండు పరీక్షలు నిర్వహించారు. ఫిజికల్‌ సైన్స్‌లో 12 చాప్టర్లు, బయోసైన్స్‌లో 10 చాప్టర్లు ఉంటాయి. ముందురోజు రివిజన్‌ చేసుకొని వెళ్లాల్సి వచ్చింది. ఇది యావరేజ్‌ విద్యార్థికి కత్తిమీద సాము లాంటిదే. దీంతో జనరల్‌ సైన్స్‌ పరీక్షల ఫలితాల్లో తగ్గుదల కనిపించడానికి కారణంగా చెబుతున్నారు.

పాతపద్ధతిలో ప్రీ ఫైనల్‌

కొన్ని జిల్లాల్లో సమ్మేటివ్‌ పరీక్షలకు, ప్రీ ఫైనల్‌ పరీక్షలకు పాతమోడల్‌ ప్రశ్నపత్రాలతోనే నిర్వహించారని కూడా తెలుస్తోంది. ఆరు పేపర్లకు సంబంధించిన ప్రశ్నపత్రాల మోడల్స్‌ను కూడా విద్యార్థులకు తెలియజేయడంలో కొంత ఆలస్యమైంది. సాధారణ విద్యార్థులు కొంత అందుకోలేకపోవడం.. అక్కడక్కడా సబ్జెక్టు టీచర్ల కొరత కూడా ప్రభావం చూపిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మొత్తానికి అన్ని యాజమాన్యాల పరిధిలో 10 జీపీఏలు తగ్గిపోయాయి. ప్రైవేట్‌ హైస్కూళ్లలోనూ కొంత ఉత్తీర్ణతా శాతం తగ్గిపోయింది.

ఉమ్మడి జిల్లాలో సబ్జెక్టుల వారీగా ఫెయిలైన విద్యార్థులు ఇలా..

జిల్లా	గణితం	సైన్స్‌	సోషల్‌	తెలుగు	హిందీ	ఇంగ్లిష్‌
హనుమకొండ	698	452	27	52	01	122
వరంగల్‌	505	441	27	381	25	143
జనగామ	349	221	03	35	00	95
జేఎస్‌ భూపాలపల్లి	69	104	03	35	03	38
మహబూబాబాద్‌	744	603	86	153	16	92

10/10 జీపీఏ సాధించిన వారు ఇలా..

జిల్లా	2021–2022	2022–23
హనుమకొండ	915	394
వరంగల్‌	249	61
జనగామ	130	68
జేఎస్‌ భూపాలపల్లి	53	26
ములుగు	28	18
మహబూబాబాద్‌	31	06

ఉత్తమ ఫలితాలు అభినందనీయం

న్యూశాయంపేట: ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమని టెమ్రిస్‌ రీజినల్‌ లేవల్‌ కన్సల్టెంట్‌ శ్రీపాల అన్నారు. ఉమ్మడి వరంగల్‌ జిల్లాలోని 16 గురుకులాల్లో ఇంటర్‌, పదో తరగతి ఫలితాల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, అధ్యాపక, ఉపాధ్యాయ బృందానికి గురువారం హనుమకొండ కేయూ క్రాస్‌ రోడ్‌లోని వరంగల్‌(జి)1 గురుకులంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి శ్రీపాల మాట్లాడారు. ఇంటర్‌ ఒకేషనల్‌ ఫలితాల్లో ఏసీపీ గ్రూపులో స్టేట్‌ ఫస్ట్‌ ర్యాంకులతో పాటు ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీతోపాటు, పదో తరగతి ఫలితాల్లో 98శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు. వచ్చే సంవత్సరంలో కూడా ఇదే విధమైన ఫలితాలు వచ్చేలా కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్‌ అధికారులు మక్బూల్‌ పాషా, అజ్మత్‌అలీ, ప్రిన్సిపాళ్లు భిక్షపతి, నీరజ, కృష్ణకుమారి, డాక్టర్‌ జంగా సతీశ్‌, కాజీపేట ప్రిన్సిపాల్‌ తనుగుల శ్రీనివాస్‌, మహబాద్‌ ప్రిన్సిపాల్‌ శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.


ఇంటర్‌ ఒకేషనల్‌ విద్యార్థులను సన్మానిస్తున్న అధికారులు

ప్రణాళికతో చదివితే విజయం సాధ్యం

దామెర: విద్యార్థులు ప్రణాళికతో చదివితే విజయం సాధ్యం అవుతుందని డిస్నీల్యాండ్‌ పాఠశాల ముఖ్య సలహాదారు దయ్యాల సదయ్య సూచించారు. హనుమకొండ జిల్లా దామెర మండలం ఒగ్లాపూర్‌ సమీపంలోని డిస్నీల్యాండ్‌ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంతో గురువారం వారిని అభినందించిన అనంతరం సదయ్య మాట్లాడారు. పట్టుదల, క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని సూచించారు. అనంతరం 10 జీపీఏ సాధించిన ముగ్గురు, 9.8 సాధించిన ఏడుగురు, 9.7 సాధించిన ఆరుగురు విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్‌ డి.శోభారాణి, డైరెక్టర్లు డి.రాకేష్‌భాను, డి.దినేష్‌చందర్‌, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

దొంగ సూపర్‌వైజర్‌!

- గోవిందాపూర్‌లో విద్యుత్‌ మోటార్‌ చోరీ
- సినీ ఫక్కీలో చేజ్‌ చేసిన మెకానిక్‌

నల్లబెల్లి: కంటి వెలుగు సూపర్‌వైజర్‌ దొంగగా మారాడు. ఓ మెకానిక్‌ ఇంటిఎదుట ఉన్న మోటార్‌ను దొంగిలించి పారిపోయే క్రమంలో పట్టుబడి జైలుపాలయ్యాడు. దీనికి సంబంధించి స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌ జిల్లా నల్లబెల్లి మండలం గోవిందాపూర్‌ గ్రామానికి చెందిన కొట్టె మహేందర్‌ విద్యుత్‌ మోటార్‌ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ఎస్‌కే మహినోద్దిన్‌ విద్యుత్‌ మోటార్‌ మరమ్మతుకు రాగా మహేందర్‌కు అప్పగించగా ఇంటి ఆవరణలో ఉంచాడు. ఇదిలా ఉండగా.. బిల్‌నాయక్‌తండాకు చెందిన మాలోత్‌ కిషన్‌ నల్లబెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్‌ అసిస్టెంట్‌గా పని చేస్తూ.. ప్రస్తుతం నల్లబెల్లి పీహెచ్‌సీ పరిధిలో కంటి వెలుగు కార్యక్రమం సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. ఈక్రమంలో మాలోత్‌ కిషన్‌ బుధవారం రాత్రి 11 గంటల సమయంలో కొట్టే మహేందర్‌ ఇంటి ఆవరణలో ఉన్న విద్యుత్‌ మోటార్‌ను ద్విచక్రవాహనంపై పెట్టుకుని పారిపోయే ప్రయత్నం చేయగా.. మహేందర్‌ కుటుంబ సభ్యులు కిషన్‌ను వెంబడించి, కన్నారావుపేట శివారులో గ్రామస్తుల సహకారంతో సినీఫక్కీలో పట్టుకున్నారు. దీంతో కిషన్‌ తన తప్పును ఒప్పుకుని విద్యుత్‌ మోటార్‌ను అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం స్థానికుల సహకారంతో రూ.15వేలు చెల్లించి రాజీ కుదుర్చుకునేందుకు ప్రయత్నించాడు. విషయం తెలుసుకున్న నల్లబెల్లి పోలీసులు నిందితుడు కిషన్‌ను అదుపులోకి తీసుకున్నారు. మెకానిక్‌ కొట్టెం మహేందర్‌ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై అజ్మీరా సురేష్‌ తెలిపారు.


స్థానికుల సహకారంతో రాజీకి ప్రయత్నిస్తున్న కిషన్‌ (సర్కిల్‌లోని వ్యక్తి)

మిర్చి తోటలో మృతదేహం లభ్యం

వెంకటాపురం(కె): ములుగు జిల్లా వెంకటాపురం(కె)మండల పరిధిలోని బెస్తగూడెం గ్రామ సమీపంలోని మిర్చి తోటలో అనుమానాస్పదస్థితిలో మృతదేహం లభ్యమైంది. ఇన్‌చార్జ్‌ ఎస్సై అశోక్‌ గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. మిర్చి తోటల్లో మృతదేహం ఉందనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించి, వెంకటాపురం మండల కేంద్రం సున్నం బట్టి వీధికి చెందిన పానెం మల్లయ్య(60) మృతదేహంగా నిర్ధారించినట్లు వెల్లడించారు. కాగా, మల్లయ్య గత కొంత కాలంగా మానసిక పరిస్థితి సక్రమంగా లేక మద్యానికి బానిసయ్యాడని, ఈక్రమంలో వారం క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారని పేర్కొన్నారు. మద్యం మత్తులో ఎండ దెబ్బ తగిలి మిర్చి తోటలో మృతి చెందాడని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కార్మికుల సంక్షేమమే కేసీఆర్‌ లక్ష్యం

- ప్రభుత్వ చీఫ్‌విప్‌ వినయ్‌భాస్కర్‌
- జేఎన్‌ఎస్‌లో ముగిసిన కార్మిక క్రీడోత్సవాలు

వరంగల్‌ స్పోర్ట్స్‌: కార్మికుల సంక్షేమమే కేసీఆర్‌ సర్కార్‌ లక్ష్యమని ప్రభుత్వ చీఫ్‌విప్‌ దాస్యం వినయ్‌భాస్కర్‌ అన్నారు. మేడే ను పురస్కరించుకుని బీఆర్‌ఎస్‌ పార్టీ సహకారంతో కార్మికశాఖ, ఒలింపిక్‌ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. హనుమకొండలోని జవహర్‌లాల్‌ నెహ్రూ స్టేడియంలో జరిగిన ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా చీఫ్‌విప్‌ వినయ్‌భాస్కర్‌ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. కార్మిక శాఖ ద్వారా ప్రతి కార్మికుడు కార్డు పొందాలని తద్వారా సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్మిక మాసోత్సవ కోఆర్డినేటర్‌ డాక్టర్‌ పుల్లా శ్రీనివాస్‌ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్‌ జిల్లా ఒలింపిక్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు మహ్మద్‌ అజీజ్‌ఖాన్‌, డిప్యూటీ కమిషనర్‌ ఆఫ్‌ లేబర్‌ సామ్యేల్‌జాన్‌, అసిస్టెంట్‌ కమిషనర్‌ ఆఫ్‌ లేబర్‌ ప్రసాద్‌, కార్మిక సంఘం నాయకులు కేసోజు ప్రణయ్‌, నాయిని రవి, కందుల స్వజన్‌కాంత్‌, ఇన్‌చార్జ్‌ డీవైఎస్‌ఓ శ్రీమన్నారాయణ, డీఎస్‌ఏ కోచ్‌లు నరేందర్‌, శంకర్‌, ప్రశాంత్‌, అఫ్జల్‌, విష్ణు, రమేష్‌ పాల్గొన్నారు.


కబడ్డీ విజేతగా బహుమతిని అందుకుంటున్న ఎలక్ట్రానిక్స్‌ ఎంప్లాయీస్‌ అసోసియేషన్‌ జట్టు

13న ఓపెన్‌ ఇంటర్‌ ఎకనామిక్స్‌ పరీక్ష

విద్యారణ్యపురి: ఉమ్మడివరంగల్‌ జిల్లాలో తెలంగాణ ఓపెన్‌ స్కూల్‌ ఇంటర్మీడియట్‌ ఎకనామిక్స్‌ తెలుగుమీడియం పేపర్‌ పరీక్షను ఈనెల 13న నిర్వహించనున్నట్లు డీఈఓ ఎండీ అబ్దుల్‌హై, ఓపెన్‌ స్కూల్‌ ఉమ్మడి వరంగల్‌ జిల్లా కోఆర్డినేటర్‌ మురాల శంకర్‌రావు గురువారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. సదరు పరీక్షను ఈనెల 2న నిర్వహించనున్నప్పటికీ పరీక్ష పేపర్‌ రాకపోవడంతో పరీక్షను రద్దుచేసిన విషయం తెలిసిందే.. ఈ నేపథ్యంలో పరీక్షను 13న ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఉమ్మడి వరంగల్‌ జిల్లాలోని ఆయా విద్యార్థులు తమకు ఇప్పటికే కేటాయించిన పరీక్ష కేంద్రాల్లో సకాలంలో హాజరు కావాలని సూచించారు.

ప్రాణంతీసిన అప్పులు

- ఆత్మహత్యకు పాల్పడిన రైతు


భద్రు(ఫైల్‌)

పెద్దవంగర: పంటల సాగుతోపాటు, బిడ్డల వివాహాలకు చేసిన అప్పులు రైతు నిండు ప్రాణాన్ని బలిగొన్నాయి. ఈ విషాద ఘటన మహబూబాబాద్‌ జిల్లా పెద్దవంగర మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై పిల్లల రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బావోజీ తండా పంచాయతీ పరిధిలోని కిష్టుతండాకు చెందిన రైతు జాటోతు భద్రు(58) తనకున్న కొద్దిపాటి భూమితోపాటు అదనంగా నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని పంటలు పండిస్తున్నాడు. పంటల సాగుతోపాటు, కుమార్తెల వివాహాలు చేసేందుకు సుమారు రూ.5 లక్షల మేర అప్పు చేశాడు. దాంతో పాటు రూ.1 లక్ష బ్యాంకు లోను తీసుకున్నాడు. అప్పు ఇచ్చిన వారు డబ్బులు ఇవ్వాలని రైతుపై ఒత్తిడి తీసుకురావడంతో అప్పు తీర్చే మార్గం కానరాక ఈ నెల 6న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న భద్రును కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈక్రమంలో చికిత్స ఖర్చులు భరించలేక గురువారం హైదరాబాద్‌ నుంచి వరంగల్‌లోని ఎంజీ ఎం ఆస్పత్రికి తరలిస్తుండగా భద్రు మృతి చెందాడు. మృతుడికి భార్య జ్యోతి, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమారుడు గణేష్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి


శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్‌)

రఘునాథపల్లి: జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలోని కుర్చపల్లి గ్రామానికి చెందిన ఉపాధి కూలీ కొండం శ్రీనివాస్‌రెడ్డి (62) వడదెబ్బతో మరణించాడు. శ్రీనివాస్‌రెడ్డి రోజూ మాదిరిగానే గురువారం గ్రామ శివారులో జరుగుతున్న రోడ్డు పనులకు వెళ్లాడు. పని చేస్తుండగా ఒక్కసారిగా వడదెబ్బతో కిందపడిపోయాడు. అస్వస్థతకు గురైన శ్రీనివాస్‌రెడ్డిని ఫీల్డ్‌ అసిస్టెంట్‌ అమృతం లక్ష్మీనారాయణ ఆటోలో ఇంటికి పంపించాడు. కుటుంబ సభ్యులు 108లో ఆస్పత్రికి తరలించేందుకు యత్నిస్తుండగా ప్రాణాలు కోల్పోయాడు. శ్రీనివాస్‌రెడ్డికి భార్య పుష్పమ్మ, కుమారుడు ఉపేందర్‌రెడ్డి, కూతురు హేమలత ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..


రైతు చిన్ని

మంగపేట: మండలంలోని రాజుపేట వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో బ్రాహ్మణపల్లి పంచాయతీ పరిధిలోని పెరకలకుంటకు చెందిన కొక్కెర నర్సింహారావు(48) అక్కడికక్కడే మృతి చెందగా దోమెడ గ్రామానికి చెందిన పుప్పాల యాకస్వామి తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని కొత్తమల్లూరు(బెస్తగూడెం) గ్రామానికి చెందిన మాటూరి రాధాకృష్ణ గురువారం మణుగూరు వైపు నుంచి వస్తున్నాడు. పెరకలకుంటకు చెందిన మృతుడు నర్సింహారావు, దోమెడకు చెందిన యాకస్వామి రాజుపేట నుంచి బ్రాహ్మణపల్లికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. మార్గమధ్యలో రాజుపేట శివారులోని ప్రభుత్వ గిరిజన పెట్రోల్‌ బంక్‌ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో నర్సింహారావు, అక్కడికక్కడే మృతి చెందగా యాకస్వామికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలిసిన వెంటనే బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిల్‌కుమార్‌, చుంచుపల్లి పీహెచ్‌సీ ఫార్మసిస్టు హిమకిరణ్‌ ఘటనాస్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తికి ప్రథమ చికిత్స చేసి 108లో ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సీతమ్మ ఫిర్యాదు మేరకు కేసున మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్‌కే తాహెర్‌బాబా తెలిపారు.

పిడుగు పాటుతో రైతు మృతి

మండలంలోని అకినేపల్లిమల్లారం గ్రామానికి చెందిన రైతు గగ్గూరి చిన్ని(50) గురువారం సాయంత్రం పిడుగుపాటుతో మృతి చెందాడు. స్థానికు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి సమీపంలో కల్లంలో చిన్ని మిర్చి ఆరబెట్టాడు. సాయంత్రం సమయంలో గాలివాన వస్తుండటంతో మిర్చిపై బరకం(పరదా) కప్పేందుకు వెళ్లాడు. బరకం కప్పేవస్తున్న క్రమంలో పిడుగుపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చిన్నికి భార్య నాగరత్తమ్మ, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అనారోగ్య సమస్యతో ఆత్మహత్య

చిల్పూరు: అనారోగ్య సమస్య తాళలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై బొల్లం వినయ్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా చిల్పూరు మండలంలోని వెంకటేశ్వరపల్లెకు చెందిన రామ్‌చరణ్‌ (15) తండ్రి 8ఏళ్ల క్రితం మృతి చెందాడు. దీంతో అతని తాత సారయ్య వద్ద ఉంటున్నాడు. చరణ్‌కు మొదటి నుంచి కళ్లలో మంటలతోపాటు అనారోగ్యంతో బాధపడేవాడు. పలు ఆస్పత్రుల్లో వైద్యం చేయించినా నయం కాకపోవడమే కాకుండా ఇటీవల సమస్య తీవ్రం అయింది. దీంతో బుధవారం రాత్రి ఇంట్లో ఎలుకల మందు తాగి పడిపోగా చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. తాత సారయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

రూ.30లక్షల ఎండు గంజాయి సీజ్‌

- మహబూబాబాద్‌ ఎస్పీ శరత్‌చంద్రపవార్‌
- ముగ్గురు అరెస్టు, పరారీలో ఒక్కరు


పట్టుబడిన ఎండు గంజాయి వాహనాలతో ఎస్పీ, పోలీసులు

నెల్లికుదురు: అక్రమంగా రవాణా చేస్తున్న రూ.30లక్షల విలువ చేసే ఎండు గంజాయితో పాటు రూ.16లక్షల విలువ చేసే రెండు వాహనాలను స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులు పూజారి నరేష్‌, గుగులోతు వెంకటేష్‌, చింతల అనిల్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ శరత్‌ చంద్ర పవార్‌ తెలిపారు. స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తొర్రూరు డీఎస్పీ రమణ బాబు, సీఐ సత్యనారాయణతో కలసి ఎస్పీ మాట్లాడారు. మహబూబాబాద్‌ జిల్లా నెల్లికుదురు మండలం బోటిమీది తండాకు చెందిన జాటోతు సునిల్‌ 2020లోనే గంజాయి కేసులో పట్టుబడటంతో భద్రాచలం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. జైలుకు వెళ్లివచ్చినా తనలో మార్పు రాలేదన్నారు. త్వరగా డబ్బు సంపాదించాలనే ఆశతో భద్రాచలం, సీలేరు ప్రాంతాల నుంచి ఎండు గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి హైదారాబాద్‌లో ఎక్కువ రేటుకు విక్రయించేవాడని తెలిపారు. ఈ క్రమంలో బోటిమీది తండాలోని తన వ్యవసాయ పొలం పరిసరాల్లో నాలుగు బస్తాల్లో 150కిలోల(115 ప్యాకెట్లు)ఎండు గంజాయిని నిల్వ చేసినట్లు తెలిపారు. గంజాయి ప్యాకెట్లను హైదారాబాద్‌కు తరలించేందుకు తనకు పరిచయమున్న మహబూబాబాద్‌ మండలం అమనగల్‌ గ్రామానికి చెందిన పూజారి నరేష్‌తో మాట్లాడాడు. మరో వాహనం కూడా అవసరం ఉందని చెప్పాడంతో నరేష్‌ తనకు తెలిసిన చింతల అనిల్‌ ద్వారా మహబూబాబాద్‌ జిల్లా కేంద్రానికి చెందిన గుగులోతు వెంకటేష్‌కు విషయం చెప్పి రెండు వాహనాల్లో ఈ నెల 10న మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో సునిల్‌ తండాకు తీసుకెళ్లారు. ఒక వాహనంలో రెండు బస్తాల్లో 40 ప్యాకెట్లు, మరొక వాహనంలో రెండు బస్తాలు 75 ప్యాకెట్ల ఎండు గంజాయిని హైదారాబాద్‌కు తరలిస్తున్నారు. ఎస్సై క్రాంతికిరణ్‌కు నమ్మదగిన సమాచారంతో వెంటనే పోలీస్‌ సిబ్బందితో కలసి మండలంలోని శ్రీరామగిరి గ్రామ క్రాస్‌ రోడ్‌ బస్టాండ్‌ వద్ద వాహనాల తనిఖీలు చేస్తున్నారు. రెండు వాహనాలను తనిఖీ చేయగా గంజాయి ఉన్న వాహనాలను వదిలిపెట్టి నలుగురు పారిపోతుండగా పోలీసు సిబ్బంది వెంబడించి ముగ్గురుని పట్టుకున్నట్లు తెలిపారు. ప్రధాన నిందితుడు జాటోతు సునిల్‌ పారిపోయినట్లు ఎస్పీ తెలిపారు. రూ.30లక్షల విలువ చేసే 150కిలోల ఎండు గంజాయి, రూ.16లక్షల విలువ చేసే రెండు వాహనాలు, ముగ్గురుని అదుపులోకి తీసుకుని తహసీల్దార్‌ యోగేశ్వరరావు సమక్షంలో పంచనామా చేసి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వివరాలను వెల్లడించారు. తొర్రూరు డీఎస్పీ రమణ బాబు, సీఐ సత్యనారాయణ, ఎస్సై క్రాంతికిరణ్‌, పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

సేవకు విశ్రాంతి లేదు

రోగులకు వైద్యులు ఇచ్చే ఔషధం ఎంత ముఖ్యమో నర్సులు చేసే సేవలూ అంతే ముఖ్యం. 'నీకేం కాదు, ధైర్యంగా ఉండు' అని నర్సు చెప్పే మాట రోగిలో భవిష్యత్తుపైన ఆశలు చిగురింపజేస్తుంది. విధుల్లో ఉన్నా, లేకపోయినా తమ చుట్టూ ఉన్నవారికి నర్సమ్మగా సేవలు అందిస్తూనే ఉంటుంది. తన సేవాగుణాన్ని చాటుకుంటూనే ఉంటుంది. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ముప్పై, నలభై ఏళ్లుగా రోగులకు సేవలు అందించిన వారిని కలిస్తే వారు పంచుకున్న విషయాలు ఇవి.

దేవుడిచ్చిన అవకాశం



ఉస్మానియా, గాంధీ హాస్పిటల్స్‌లో .. దాదాపు నలభై ఏళ్ల నర్సుగా, నర్సింగ్ టీచర్‌గా విధులు నిర్వర్తించాను. కర్నూల్‌లోనూ చీఫ్ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా వర్క్ చేశాను. ఏడాది క్రితం రిటైర్ అయ్యాను. కొంత కాలం క్రితం మాకు తెలిసిన వారి అమ్మాయికి హార్ట్‌లో హోల్ ఉందని తెలిసింది. ఏ డాక్టర్‌ను కలిస్తే ఎలాంటి చికిత్స అందుతుంది, ఎలాంటి గైడెన్స్ అవసరం అనే విషయాలు చెప్పడంతో పాటు కొన్ని నెలలు వారింట్లోనే ఉన్నాను. టైమ్‌కు మందులు, ఫుడ్ చార్ట్ ప్రకారం ఫాలో అవడంలాంటి జాగ్రత్తల మూలంగా ఆ అమ్మాయి సేవ్ అయ్యింది. ఇదొక్కటే కాదు హైదరాబాద్, రాం కోఠిలోని మా కాంప్లెక్స్, కాలనీలలో తెలిసిన వారు ఎవరికి ఆరోగ్య సమస్య వచ్చినా, ఏ డాక్టర్ని కలవాలి అని అడగడంతో పాటు, జాగ్రత్తలు చెప్పమని కోరుతారు. ప్రెగ్నెంట్ ఉమన్ కనిపిస్తే చాలు – వారు అడగకపోయినా వారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారో కనుక్కుంటాను. ఇన్నేళ్లపాటు వర్క్‌లో ఉన్నాను కాబట్టి నాకు తెలిసినవారి జాబితా ఎక్కువ. ఇతర రాష్ట్రాలలోనూ ఉన్నారు. వారు కూడా ఏ రాత్రి ఏ వైద్య సలహా అవసరం వచ్చినా అడుగుతుంటారు. సేవ అనేది దేవుడు ఇచ్చిన అవకాశంగా భావిస్తాను. అదే ఎంతో మంది రోగులకు స్వస్థత చేకూర్చేలా చేసిందనుకుంటాను. సేవకు ఎప్పుడూ రిటైర్‌మెంట్ ఉండదని నాకు ప్రతిరోజూ ఒక్క సంఘటనైనా రుజువు చేస్తుంటుంది.

– పంకజ రుతు, రాంకోటి, హైదరాబాద్

విధుల్లోలేని సమయాల్లోనూ..



నిమ్స్‌లో విధులను నిర్వర్తిస్తున్నాను. మరో రెండేళ్లలో రిటైర్‌మెంట్ ఉంది. అయితే, హాస్పిటల్ వరకే మా సేవలు ఉండవు. నర్సింగ్ సేవకు రోజుకు ఇన్ని గంటలే అనే నియమం ఉండదు. స్వచ్ఛందంగానూ మా కాలనీలోనూ, కాంప్లెక్స్‌లోనూ, తెలిసినవారికి అవసరమైన వారికి సేవలు ఇస్తుంటాను. ఈ మధ్య కాలంలో మా కాంప్లెక్స్‌లో ఒక పెద్దాయనకు పక్షవాతం వచ్చింది. పూర్తిగా బెడ్‌కే పరిమితం అయ్యాడు. ప్రతిరోజూ డ్యూటీకి వెళ్లడానికి ముందు వారింటికి వెళ్లి, ఆ రోజు అతని పరిస్థితి ఎలా ఉందో కనుక్కొని, ఆ రోజు షెడ్యూల్‌ను కచ్చితంగా ఫాలో అయ్యారో లేదో అడిగి తెలుసుకుంటాను. ఆ రోజు ఎలాంటి కేర్ తీసుకోవాలో చెబుతాను. మిగతావాళ్లూ తమ ఆరోగ్యస్థితి గురించి అడిగితే చెబుతుంటారు. అలాంటప్పుడు వారికి డాక్టర్ ప్రిస్క్రిప్షన్ చూసి ఇంజక్షన్స్ వంటివి అవసరం ఉన్నవారికి చేస్తుంటాను. ఎవరికి ఆరోగ్యసమస్య వచ్చి, సాయం కోరినా అందుబాటులో ఉండటం కూడా సేవగా భావిస్తాను.

– అరుణ పాల్వాయి, మియాపూర్, హైదరాబాద్

ఊరటనివ్వడమే ఆనందం



గాంధీలో స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో ట్యూటర్‌గా రిటైర్ అయ్యాను. ఆ తర్వాత ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీ ఉద్యోగుల ఆరోగ్య సలహాల కోసం ఆరేళ్ల వర్క్ చేశాను. మూడేళ్లుగా ఇంటి వద్దే ఉంటున్నాను. కానీ, ఉద్యోగంలో లేను అనే ఆలోచన ఎప్పుడూ రాదు. మా ఏరియాలో నేను అందరికీ తెలుసు. నాకు దాదాపుగా అందరూ పరిచయమే. ఆ విధంగా మా ఏరియాలో ఎవరికి ఆరోగ్య సమస్య వచ్చినా పిలుస్తారు. సలహాలు అడుగుతారు. హాస్పిటల్ నుంచి వారు వచ్చాక వెళ్లి కలుస్తాను. ఏ మందులు ఎలా వాడాలో చెబుతుంటాను. మా ఏరియాలో ఎవరికైనా చంటిపిల్లలు పుడితే, వారు పిలవకపోయినా వెళతాను. ప్రసవం అయ్యాక తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చంటిపిల్లలను ఎలా చూసుకోవాలో సూచనలు ఇస్తుంటాను. ఎవరైనా చనిపోతే వెళ్లి, డెడ్‌బాడీని ఎలా కేర్ చేయాలో, ఎందుకు అవసరమో చెబుతుంటాను. మా ఏరియాలో ఈ మధ్య ఒక అన్నకు యాక్సిడెంట్ అయ్యి కాలు విరిగింది. హాస్పిటల్ నుంచి వచ్చాక నెల రోజుల పాటు రోజూ వారి ఇంటికి వెళ్లడం, కాలుకు వాపు రాకుండా జాగ్రత్తలు చెప్పడం, డ్రెస్సింగ్ చేయడం, మందులు వాడటం గురించి చెబుతుండేదాన్ని. ఇప్పుడు ఆ అన్న నడుస్తున్నారు. సమస్య నుంచి తేరుకున్నాక వారి మొహాల్లో కనిపించే రిలీఫ్ నాకు ఎంతో ఆనందానిస్తుంది.

– నీరజాక్షి, వికారాబాద్

– నిర్మలారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

పేరెంటింగ్

ఓడినప్పుడు అండగా నిలవండి



**పరీక్షల రిజల్ట్స్ వచ్చాయి.
అందరూ గెలవరు.
కొందరు ఓడుతారు.
గెలవడానికి ఎన్ని కారణాలో
ఓడటానికి అన్ని కారణాలు.
తల్లిదండ్రుల ఆశలు, ఆకాంక్షలు
ఒక క్షణం పిల్లలు తెచ్చిన ఫలితాలతో
డిస్టర్బ్ అయినా దండించే సందర్భం ఇది కాదు.
పిల్లల ఓటమిని అర్థం చేసుకోవడమే
ఇప్పుడు అవసరం.
వారిని గమనించి
తిరిగి ముందుకు నడపడమే అవసరం.
ఓడిన పిల్లలకు అండగా నిలవండి.**

కొందరు లెక్కలేని పిల్లలు ఉంటారు. వీరు ఎగ్జామ్స్ బాగానే రాసినా రిజల్ట్స్ తేడాగా వస్తే పట్టించుకోరు. ఫెయిల్ అయితే మరీ కొంపలు మునిగినట్టుగా కూచోరు. నెక్స్ట్ టైమ్ చూసుకుందాం అన్నట్టు ఉంటారు. ఈజీగా ఉంటారు. కాని కొందరు పిల్లలు పరీక్షలు ఎలా రాశారో ఇంట్లో కచ్చిత అంచనాతో చెప్పరు. ఫెయిల్ అవుతామేమోనని భయపడుతూ ఉంటారు. ఫెయిల్ అయితే ఇక పూర్తిగా ముడుచుకుపోతారు. తల్లిదండ్రుల ముందుకు రారు. బంధువుల్లో పరువుపోయిందని బాగా బెంబేలు పడతారు. ఎవరితోనూ కలవరు. ఇక భవిష్యత్తు ముగిసినట్టే భావిస్తారు. వీరితోనే సమస్య. వీరు ఏ క్షణమైనా పేలే బుడగలాంటివారు. ఇలాంటి వారితో తల్లిదండ్రులు చాలా అప్రమత్తంగా ఉండాలి. స్నేహితుల్ని, బంధువుల్ని అప్రమత్తం చేయాలి. ఈ దశ నుంచి వారిని సక్రమంగా బయటపడేయాలి.

ఫెయిల్ ఎందుకు?

ఈ ప్రశ్న పిల్లల్ని అడిగే ముందు పెద్దలే ప్రశ్నించుకోవాలి. పిల్లల్ని సరైన బడి/కాలేజ్‌లోనే చేర్చారా? అక్కడ పాఠాలు సరిగా జరిగాయా? సిలబస్ పూర్తి చేశారా? నోట్స్ సరిగా ఇచ్చారా? స్టూడెంట్ ఆ సబ్జెక్ట్స్ ఎలా ఫాలో అవుతున్నాడో ఎందులో వీక్ ఉన్నాడో టీచర్లు ఇంటికి ఫీడ్ బ్యాక్ ఇచ్చారా? పిల్లలకు ట్యూషన్ అవసరమైతే సరైన ట్యూషన్ పెట్టించారా? పిల్లలు చదివే వాతావరణం ఇంట్లో ఉందా? వారు చదువుకునే వీలు లేకుండా అస్తమానం పనులు చెప్తూ, టీవీ మోగిస్తూ, ఇంట్లో నాన్ సీరియస్ వాతావరణం పెట్టారా? పరీక్షల సమయంలో సిలబస్‌ను సరిగా విభజించుకుని చదవగలిగాడా? ఎగ్జామ్‌లో ఇచ్చిన ప్రశ్నలకు టైమ్ మేనేజ్‌మెంట్ చేయగలిగాడా? ఎగ్జామ్ భయంతో ఏమీ రాయలేకపోయాడా?... ఇవన్నీ ఫెయిల్ అవడానికి కారణాలు. టెన్త్ వరకూ అందరికీ తప్పదు కాని ఇంటర్ విషయానికి వచ్చేసరికి ఇష్టమైన కోర్సుల్లో చేర్చారా? చదవే ఆసక్తి, శక్తి ఉన్న సబ్జెక్ట్స్‌లోనే చేర్చారా?... ఇవీ ముఖ్యమైన విషయాలే.

ఏం చేయకూడదు?

పిల్లలు ఫెయిల్ అయ్యారని తెలియగానే ముందు వారికి నొప్పి కలిగే మాట ఏదీ మాట్లాడకూడదు. వారితో మాట్లాడటం మానేయకూడదు. కొట్టడం ఇంకా చెడ్డ చర్య. ఎవరితో పోల్చకూడదు. బాగా మంచి మార్కులతో పాసైన వారిని చూపించి వీరిని హేళన చేయకూడదు. భోజనాల దగ్గర 'మింగుదూ రా' లాంటి మాటలు పొరపాట్న కూడా మాట్లాడకూడదు. తోబుట్టువులను ఉసిగొల్పకూడదు. కొంత మంది తల్లిదండ్రులు ఏడ్చి, నెత్తి బాదుకుని భయభ్రాంతం చేస్తారు. ఏమాత్రం కూడదు. ఆడపిల్లైతే 'పెళ్లి చేసి పారేస్తాం' అని మగపిల్లలైతే 'నాలుగు గేదెలు కొనిస్తాం. మేపుకో' అని అనడం చాలా ప్రతికూల ప్రభావం చూపుతుంది.

ఏం చేయాలి?

'మరో అవకాశం ఎప్పుడూ ఉంటుంది. మరేం పర్వాలేదు' అని చెప్పాలి. 'నీకు ఎలాంటి సపోర్ట్ కావాలి? ఈ పరీక్షలు పాస్ కావడంలో నీకు ఎదురైన సమస్య ఏమిటి?' అని తెలుసుకోవాలి. ఒకవేళ పిల్లవాడు బాగా రాశాననే నమ్మకం ఉంటే రీవాల్యుయేషన్‌కు వెళ్లాలి. ప్రతి స్టూడెంట్‌కు ఎవరో ఒక టీచర్/లెక్చరర్ మీద గురి ఉంటుంది. కొంత చనువు ఉంటుంది. అలాంటి వారి దగ్గరకు తీసుకెళ్లి కౌన్సెలింగ్ చేయించాలి. ఇది తాత్కాలిక అడ్డంకి అని దీనిని దాటి ముందుకు పోవచ్చని భరోసా ఇవ్వాలి. పట్టుదలతో ప్రయత్నిస్తే సాధిస్తావ్ అని చెప్పాలి. స్నేహితులతో కూడా ఇవే మాటలు చెప్పించాలి. ఆరోగ్యం, ఆయుష్షు ఉంటే జీవితంలో చాలా సాధించవచ్చని ఆశ కల్పించాలి. ఈ సమయంలో వారిని ఒంటరిగా వదలకూడదు. చదువు ముఖ్యమే కాని చదువు కంటే జీవితం ముఖ్యమనే విషయం బోధపరచాలి. తల్లిదండ్రులు కూడా అదేసంగతి తెలుసుకోవాలి. 'తక్కువ మార్కులతో పాసైన వారు ఎక్కువ మార్కులతో పాసైనవారిని భవిష్యత్తులో జీతానికి పెట్టుకోవచ్చు'. చెప్పలేం కదా.

పిల్లలు ఫెయిల్ అయ్యారని తెలియగానే ముందు వారికి నొప్పి కలిగే మాట ఏదీ మాట్లాడకూడదు. వారితో మాట్లాడటం మానేయకూడదు. కొట్టడం ఇంకా చెడ్డ చర్య. ఎవరితో పోల్చకూడదు. బాగా మంచి మార్కులతో పాసైన వారిని చూపించి వీరిని హేళన చేయకూడదు. భోజనాల దగ్గర 'మింగుదూ రా' లాంటి మాటలు పొరపాట్న కూడా మాట్లాడకూడదు. తోబుట్టువులను ఉసిగొల్పకూడదు.

ఫ్యాషన్

ఎనీటైమ్ ఇక్కత్ స్టైల్









వేసవి అనగానే మనకు కాటన్స్ ప్రధానంగా గుర్తుకు వస్తాయి. కంఫర్ట్ సరే స్టైల్ మాటేమిటి.. అనుకునేవారికి ఇక్కత్ కాంబినేషన్‌తో అట్రాక్ట్ చేస్తున్నాయి. మోడర్న్ లుక్‌తో స్టైల్‌లో సాటిరావనిపిస్తున్నాయి. సీజనల్‌గానే కాదు హుందాతనంలోనూ మాకు మేమే పోటీ అంటున్నాయి.





కాటన్స్ అనగానే వయసుపైబడినవారు వేసుకునేవి... అనే ఆలోచన ఈ రోజుల్లో మారిపోయింది. ఖాదీ కాటన్, ఇక్కత్ కాంబినేషన్‌లో షార్ట్ కుర్తీస్, జాకెట్స్, స్కర్ట్స్, ఫ్రాక్స్, టాప్స్ ఎప్పుడూ ప్రత్యేకంగా ఉంటాయి. కూల్, కంఫర్ట్ లుక్‌తో క్యాజువల్, అఫిషియల్ వేర్‌గానూ ఆకట్టుకుంటున్నాయి. ఎనీ టైమ్ స్టైల్ అంటూ ఈ సీజన్‌లో తమ స్పెషాలిటీ చాటుతున్నాయి.

**కాకర డయాబెటిస్‌ను నియంత్రిస్తుంది.
వ్యాధి నిరోధకశక్తిని పెంచుతుంది.
అంటువ్యాధులు... వాపులను తగ్గిస్తుంది.
రక్తాన్ని శుద్ధి చేస్తుంది... మంచి ఊపిరినిస్తుంది.
కళ్లు... ఎముకలు... లివర్ పనితీరును మెరుగుపరుస్తుంది.
సెల్ డ్యామేజ్‌ని అడ్డుకుని చర్మానికి మేలు చేస్తుంది.
ఇన్ని 'మేళ్లు' చేయడం కాకరకాయకే సాధ్యం.
అందుకే... ఈ చేదు రుచులను స్వాగతిద్దాం.
ఈ వారం మన 'వంటిల్లు'ను కాకరకు వేదిక చేద్దాం.**

వంటిల్లు



కాకర కరకర

చిప్స్...



కావలసినవి: కాకరకాయలు – పావు కేజీ ; మజ్జిగ – 50 మిలీ ; చింతపండు – అంగుళం ముక్క ; ఉప్పు – టీ స్పూన్ ; మిరప్పొడి– అర టీ స్పూన్ ; నూనె– 2 టేబుల్ స్పూన్‌లు ; ఆవాలు – అర టీ స్పూన్ ; పచ్చి శనగపప్పు – టీ స్పూన్ ; వెల్లుల్లి రేకలు – 4 ; ఎండుమిర్చి –2.

తయారీ: ● కాకరకాయలను శుభ్రంగా కడిగి మొదలు, చివరలు తీసేసి చక్రాలుగా (మరీ పలుచగా కాదు, కొంచెం మందంగా) తరగాలి. ఈ ముక్కలను మందపాటి పాత్రలో వేసి అందులో మజ్జిగ, ఉప్పు, చింతపండు వేసి సన్నమంట మీద ఐదు నిమిషాల సేపు (తేమ ఇగిరి పోయేవరకు) ఉడికించాలి. ● మందపాటి బాణలిలో నూనె వేడి చేసి ఆవాలు, పచ్చి శనగపప్పు, ఎండుమిర్చి, వెల్లుల్లి రేకలు వేసి వేగిన తర్వాత ఉడికించి పెట్టుకున్న కాకరకాయ ముక్కలను వేసి వేయించాలి. చివరగా కారం చల్లి దించేయాలి. ఇందులో పల్లీల పొడి లేదా కొబ్బరి కారం కూడా చల్లుకోవచ్చు. ఇది పప్పు, సాంబార్, రసంలోకి చక్కటి సైడ్ డిష్. ● కాకరకాయ చిప్స్‌ను నిల్వ చేసుకోవాలంటే... మజ్జిగలో ఉడికించిన తర్వాత ముక్కలను ఒకరోజు ఎండ బెట్టి ఆ తర్వాత నూనెలో వేయించుకోవాలి. ఇలా చేస్తే వారం పాటు తాజాగా ఉంటాయి.

తోరన్...



కావలసినవి: కాకరకాయలు – అర కేజీ ; పచ్చి కొబ్బరి తురుము – పావు కేజీ ; పచ్చి మిర్చి– 10 (సన్నగా తరగాలి) ; బెల్లం లేదా బెల్లం పొడి– 3 టేబుల్ స్పూన్‌లు ; ఉప్పు – టీ స్పూన్ ; పసుపు– అర టీ స్పూన్ ; కరివేపాకు – 2 రెమ్మలు ; నూనె– 5 టేబుల్ స్పూన్‌లు.

తయారీ: ● కాకరకాయలను శుభ్రంగా కడగాలి. చివరలు తొలగించి కాయను నిలువుగా చీల్చాలి. ● స్పూన్‌తో కాయలోని గింజలను, మెత్తటి భాగాన్ని తీసేయాలి. కాయ పై భాగాలను చిన్న ముక్కలుగా తరగాలి. ● ఈ ముక్కలను మందపాటి పాత్రలో వేయాలి. అందులో బెల్లం, పచ్చిమిర్చి తరుగు, కొబ్బరి తురుము వేసి (నీరు పోయకుండా) సన్న మంట మీద ఉడికించాలి. కొద్దిగా వేడెక్కిన తర్వాత పసుపు, పసుపు, నూనె కూడా వేసి కలిపి మూత పెట్టి ఐదు నిమిషాల సేపు ఉడకనివ్వాలి. ఆ తరవాత తరచూ కలుపుతూ ఉడికించాలి. అవసరం అనిపిస్తే మరికొద్దిగా నూనె వేయాలి. కరివేపాకు వేసి కలిపి మూత పెట్టి మగ్గనివ్వాలి. ఈ కేరళ కర్రీ అన్నంలోకి రొట్టెల్లోకి కూడా మంచి కాంబినేషన్.

పవక్కై తీయర్ కర్రీ ...



కావలసినవి: కాకరకాయలు – 2 (ముక్కలు తరగాలి) ; ఉల్లిపాయలు – పది (సాంబారు ఉల్లిపాయలు) ; పసుపు – అర టీ స్పూన్ ; చింతపండు రసం– టేబుల్ స్పూన్ ; చింతపండు – ఒక కణుపు ; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; కొబ్బరి నూనె లేదా వంట నూనె – టీ స్పూన్ ; ఆవాలు – పావు టీ స్పూన్ ; కరివేపాకు రెమ్మ – 1 ; ఎండుమిర్చి – 2.

మసాలా కోసం: మెంతులు – అర టీ స్పూన్ ; ధనియాలు – టేబుల్ స్పూన్ ; ఎండుమిర్చి – 1 ; తాజా కొబ్బరి తురుము – కప్పు.

తయారీ: ● కాకరకాయ ముక్కల్లో చింతపండు, ఉప్పు, పసుపు వేసి ఒక మోస్తరుగా ఉడికించాలి. ఇలా చేయడం వల్ల చేదు విరిగిపోతుంది. ● ప్రెషర్ కుకర్‌లో కాకర ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు, చింతపండు రసం, ఉప్పు, పసుపు వేసి మూత పెట్టి రెండు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి. ● ప్రెషర్ తగ్గేలోపు మసాలా సిద్ధం చేసుకోవాలి. ● ఒక బాణలిలో మెంతులు, ధనియాలు, ఎండుమిర్చి వేసి సన్న మంట మీద దోరగా వేగిన తర్వాత కొబ్బరి తురుము వేసి బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. ● ఈ దినుసులన్నీ చల్లారిన తర్వాత తగినంత నీటిని కలుపుతూ మెత్తగా పేస్ట్ చేయాలి. ● కుకర్ మూత తీసి మసాలా వేసి కలిపి మళ్లీ వెలిగించి మూత పెట్టకుండా ఉడికించాలి. అవసరాన్ని బట్టి మరికొంత నీటిని కలిపి రుచి చూసుకుని చిక్కదనం సరిపోయే వరకు పెద్ద మంట మీద ఉడికించి దించేయాలి.
– బాణలిలో నూనె వేడి చేసి ఆవాలు, ఎండుమిర్చి, కరివేపాకు వేయించి కర్రీలో వేసి కలిపితే పావక్క తీయాల్ రెడీ.

స్టఫ్డ్...



కావలసినవి: కాకరకాయలు – పావు కేజీ ; పసుపు – అర టీ స్పూన్ ; ఉప్పు – టీ స్పూన్ ; నూనె – 2 టేబుల్ స్పూన్‌లు.

స్టఫ్ కోసం: మీగడ లేదా తరిగిన పనీర్– 2 టేబుల్ స్పూన్‌లు మిరప్పొడి– టీ స్పూన్ ; ఉప్పు– టీ స్పూన్ ; చాట్ మసాలా పొడి లేదా గరం మసాలా పొడి– టేబుల్ స్పూన్ ; ఆమ్‌చూర్ పౌడర్– టీ స్పూన్.

తయారీ: ● కాకరకాయలను కడిగి మొదలు, చివరలు తీసేసి ఒక్కో కాయను ముక్కలుగా (ఫొటోలో కనిపిస్తున్నట్లు) చేయాలి. ● ఒక పాత్రలో నీటిని మరిగించి, మరుగుతున్న నీటిలో పసుపు, ఉప్పు, కాకరకాయ ముక్కలను వేసి మూతపెట్టి మంట ఆపేయాలి. ● ఐదారు నిమిషాల తర్వాత నీటిలో నుంచి కాకరకాయ ముక్కలను తీసి ఒక ప్లేట్‌లో పెట్టాలి. ● స్టఫ్ కోసం తీసుకున్న దినుసులన్నింటినీ ఒక పాత్రలో వేసి బాగా కలపాలి. కాకరగింజలను తొలగించి ఆ స్థానంలో ఈ మిశ్రమాన్ని స్టఫ్ చేయాలి. ● బాణలిలో నూనె వేడి చేసి స్టఫ్ చేసిన కాకరకాయ ముక్కలను వేసి వేయించాలి.

గమనిక: స్టఫ్ కోసం ఉల్లి, వెల్లుల్లి కారం కూడా వాడుకోవచ్చు.